క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్.శంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కైత్లాపూర్, రాజీవ్ గాంధీ నగర్, సఫ్దార్‌నగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాఘవేంద్రనగర్, శ్రీరామ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో..

కేపీహెచ్‌బీకాలనీ: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఏ.సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 1.30 గంటల వరకు వసంత్‌నగర్, బీఎస్‌నగర్ ఫేజ్– 2 ప్రాంతాల్లో.. భగత్‌సింగ్ నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎస్‌నగర్ ఫేజ్ 1, వసంత్‌నగర్ నుంచి శ్రద్ధ స్కూల్ రోడ్డు, ఎస్‌పీ నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ధోలారీధనీ, కొంపల్లి, అపర్ణ, వెన్‌సాయి, నూజివీడు, జయభేరి, ఎన్‌సీఎల్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జేఎన్ఎన్‌యూఆర్ఎం, 11 కేవీ కోకకోలా ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంబిటాస్ స్కూల్, డాలర్ మీడోస్, అమర్ దాబా, బావర్చి హోటల్, ఎస్‌బీఐ కాలనీ, సింహపురి కాలనీ, నెక్సస్ విల్లాస్, గోకుల్ విల్లాస్, లహరి ఎస్టేట్స్, విజ్ఞానజ్యోతి హాస్టల్, క్రీక్ స్కూల్, భౌరంపేట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం, భౌరంపేట్ 60 గజాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సన్మానం



నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించిన రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ప్రగతినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ఉపాధ్యక్షుడు సత్తయ్య, జనరల్ సెక్రటరీ విజయ్, ట్రెజరర్ తులసీదాస్‌ను బీజేపీ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధికి పాటుపడి ప్రజల అవసరాలు తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, గోపాల్‌రావు, బాలుయాదవ్, నరేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌పై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



శ్రావణ్‌కుమార్ రెడ్డి (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఓ యువకుడు హాస్టల్ ఆరో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కిషన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అడ్డగుట్ట సొసైటీలోని నెస్ట్ ఇన్ హాస్టల్‌లో ఉంటున్న వంగూరు శ్రావణ్ కుమార్‌రెడ్డి (22) ఆరు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడు. కడుపునొప్పి తీవ్రంగా ఉండటంతో శ్రావణ్‌కుమార్‌రెడ్డి తన మిత్రుడు ఉంటున్న శ్రీనిధి హాస్టల్‌కు వెళ్లి అతడితో కలిసి ఉన్నాడు. కడుపు నొప్పి తీవ్రత తట్టుకోలేక శ్రీనిధి హాస్టల్ ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడ ఉన్నవారు శ్రావణ్‌కుమార్‌రెడ్డిని స్థానికంగా ఉన్న ప్రతిమ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటన సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

పరికి చెరువులో దోమల మందు స్ప్రే

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువులో డ్రోన్ సాయంతో దోమల మందు పిచికారీ, ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాలను చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సిబ్బందిని అడిగి కంటి వెలుగు వివరాలు తెలుసుకున్నారు. దోమల మందు పిచికారీ చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సీనియర్ ఎంటమాలజిస్ట్ లచ్చిరెడ్డి, ఏఈ ఉషారాణి, సూపర్‌వైజర్ డి.నరసింహులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.





కార్మికులకు నివాసం · కోటీశ్వరులకు ఆవాసం

కార్మికులకు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అనువైన ప్రాంతం

ఆల్విన్‌కాలనీ: ఒకప్పుడు సనత్‌నగర్, పటాన్‌చెరువులలో ఉండే ఆల్విన్ కంపెనీ భారతదేశంలో ఒక అగ్రగామి కంపెనీగా చెలామణి అయ్యింది. ఒక కంపెనీతో ఏర్పడిన ఆల్విన్ కంపెనీ నగరంలో ఆల్విన్ వాచీలు, బస్ బాడీ, బేరింగ్స్, ఫ్రిజ్‌లు వంటి వాటిని ఉత్పత్తి చేసింది. దేశ నలుమూలల్లో నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన కార్మికులకు ఆల్విన్ కంపెనీ యాజమాన్యం వారికి ఉపాధి కల్పించి భవిష్యత్‌ను అందించింది. వారి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నగరంలో అనేక ప్రాంతాల్లో ఆల్విన్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వటంతో పాటు ఇళ్లను కూడా నిర్మింపచేసి అందించింది.

◆ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 1984–85 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆల్విన్ కంపెనీ కార్మికులకు సొంత నివాసం కల్పించాలనే ఉద్దేశంతో కూకట్‌పల్లి మండల పరిధిలోని 336 సర్వే నెంబర్‌లో 1984–85లో 79 ఎకరాల 29 గుంటల స్థలాన్ని ఆల్విన్ కంపెనీ కార్మికులకు అందజేశారు. మొదటి ఫేజ్ 1985–86లో 39 ఎకరాలు, రెండో ఫేజ్ 1986–87లో 40 ఎకరాల 29 గుంటల స్థలాన్ని అందజేసింది. రెండు ఫేజుల్లో క్వార్టర్స్‌ను నిర్మించి అలాట్ చేశారు.

◆ మొదటి ఫేజు నాటి దివంగత యంపి ఆలే నరేంద్ర, యూనియన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సమయంలో ఆయన చేతుల మీదుగా కార్మికులకు అలాట్‌మెంట్ చేశారు.

◆ రెండో ఫేజ్ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన చేతుల మీదుగా కార్మికులకు ఇళ్లను అందజేశారు.

సొంత డబ్బుతో వంతెన నిర్మించుకున్న కార్మికులు

ఈ ప్రాంతం నాడు నగరానికి దూరంగా రాళ్ల రప్పలతో చిట్టడవిని తలపించేది. మూడు షిప్టుల్లో డ్యూటీ చేసుకునే వారు ఈ క్వార్టర్స్ ప్రాంతానికి రావాలంటే బస్సు సౌకర్యం, రవాణా సౌకర్యం కూడా ఉండేది కాదు. కనీసం రాకపోకలు కొనసాగించలేని పరిస్థితి ఉండేది. దీంతో కార్మికులే ఇంటికి రూ.500 చొప్పున జమ చేసి కూకట్‌పల్లి సప్తగిరికాలనీ రామాలయం వద్ద పరికిచెరువు, ఎల్లమ్మ చెరువు నాలాపై వంతెనను నిర్మించుకున్నారు. ఈ కాలనీ విస్తరించిన తరువాత ఎల్లమ్మబండ, జగద్గిరిగుట్ట తదితర బస్తీలు త్వరితగతిన విస్తరించడంతో కొంత సౌకర్యాలు కల్పించారు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతం నేటికీ సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతూనే ఉంది.

కంపెనీ మూతపడటంతో క్వార్టర్స్ అమ్ముకున్న వైనం

కంపెనీ మూత పడటంతో కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయింది. సుమారు 12 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కొంత మందిని మాత్రమే వేరే కంపెనీలకు ట్రాన్స్‌ఫర్ చేసి వెసులుబాటు కల్పించారు. మరి కొంతమందికి వీఆర్ఎస్ ఇచ్చి తొలగించారు. 2005 సంవత్సరం వరకు ఒక వెలుగు వెలిగిన కంపెనీ, ఉద్యోగులు ఒక్కసారిగా దుర్భర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. అనేక మంది కార్మికులు ఉపాధి మార్గం దొరకక, కుటుంబ సభ్యులను పోషించుకోలేక సుమారు 60 శాతం మంది కార్మికులు క్వార్టర్స్ అమ్మేసుకొని దూర ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసే వారు క్వార్టర్స్ కొనుగోలు చేశారు.

ఇక్కడి భూములకు రెక్కలు..

కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరగటంతో ఆల్విన్‌కాలనీలో భూములకు కూడా రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ స్థలం కొనుగోలు చేయాలంటే వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం కొనాలంటే సుమారు 70వేల నుంచి లక్ష రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఒకప్పుడు కార్మికుల క్వార్టర్స్‌తో ఉన్న కాలనీలో నేడు బహుళ అంతస్తుల భవనాలకు నిలయంగా మారి చూపరులను సైతం ఆకర్షిస్తోంది.

◆ ఈ ప్రాంతం జాతీయ రహదారికి, హైటెక్ సిటీకి దగ్గర దారి కావటంతో కూడా అనేక మంది నివాసం ఏర్పాటు చేసుకుంటూ అద్దెకు ఉంటున్నారు. అన్ని సౌకర్యాలు కూడా ఉండటం, వ్యాపారాలు అభివృద్ధి చెంది ఏది కావాలన్నా అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతంపై ఎక్కువ మంది దృష్టి సారించారు. ఈ ఆల్విన్‌కాలనీ ప్రాంతం చుట్టూ పారిశ్రామిక వాడలైన జీడిమెట్ల, రంగారెడ్డినగర్, కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్‌లు దగ్గర కావటంతో అన్ని రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులకు అనువైన ప్రాంతంగా ఉండటంతో ఇక్కడే నివాసం ఉండటానికి ఇష్టపడుతుంటారు.

ప్రస్తుతం మెరుగైన వసతులు..



ఆల్విన్‌కాలనీ గతంలో చిన్న కాలనీగా ఉండి చిన్న చిన్న క్వార్టర్స్ సముదాయంగా ఉండేది. ప్రస్తుతం కాలనీలో బహుళ అంతస్తుల భవనాలను సౌకర్యాలు కూడా పెరిగాయి. కాలనీలో చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికి స్థానిక శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ల సహాయ సహకారాలతో సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి చేసుకుంటున్నాం. రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో మెరుగైన వసతులు ఏర్పడ్డాయి.

– కృష్ణారావు, ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉపాధి లేక కార్మికులు సతమతం..



ఆల్విన్‌కాలనీలో కార్మికులు ఎక్కువగా నివసిస్తుంటారు. ఇక్కడ ప్రధానంగా తాగునీటి సమస్య. కాలనీలో బల్క్ సిస్టమ్ ద్వారా నీటిని సరఫరా చేస్తుంటారు. వాటర్‌బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికులు కట్టలేని పరిస్థితి. ప్రభుత్వం చొరవ చూపి ఈ మొత్తాన్ని తగ్గిస్తే బాగుంటుంది. ఇప్పటికే కార్మికులు ఉపాధి లేక సతమతమవుతున్నారు. ఈ కాలనీలోని యువతకు ఉపాధి కల్పించేలా సొసైటీ భవనంలో ట్రైనింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– యాదవరెడ్డి, ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు

అల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో రూ.3.65కోట్లతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు కోసం సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అల్లాపూర్ డివిజన్‌లో ఇప్పటికే 98 శాతం పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఒకప్పుడు ఈప్రాంతం ఎంతో అస్తవ్యస్తంగా ఉండేదన్నారు. నేడు అద్దాల్లాంటి రోడ్లతో అల్లాపూర్ డివిజన్ రూపురేఖలు మారాయిని తెలిపారు. అదే విధంగా ప్రజలకు కావాల్సిన మంచినీరు, కమ్యూనిటీహాలులు, పార్కులు, ఇండోర్ స్టేడియాలు కూడా రూపుదిద్దుకున్నాయని అన్నారు. ఎప్పుడు నిధులు కొరత ఉన్నా వెంటనే మంత్రి కేటీఆర్‌ను సంప్రదించి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్నామని పేర్కొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అడ్డుకట్టేది..?

కేపీహెచ్‌బీకాలనీ: లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని కొంతమంది టిఫిన్ సెంటర్‌లు, పాన్ డబ్బాలు ఏర్పాటు చేస్తున్నారు. వారి కోసమే ఫుట్‌పాత్‌లు నిర్మించినట్లుగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కట్టా నరసింగరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను ఎన్నిసార్లు వివరించినా జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్లు పట్టించుకోవడం లేదన్నారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన షాపుల వద్దకు వచ్చే వారు వారి కార్లను, ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన టిఫిన్ షాపులు, పక్కనే పార్క్ చేసిన వాహనాలు

మహిళలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజానోల లక్ష్మిని సోమవారం టీపీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటూ గౌరవిస్తుందన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి మండలిలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి గౌరవించినట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరి కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయాలని కోరారు. మహిళలు రాజకీయాల్లో రాణించడానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కృషి చేస్తుందని, పెద్ద ఎత్తున మహిళలకు సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, జ్యోతి, రజిత, సంధ్య, అరుణయాదవ్, జోజోమ్మ, లక్ష్మీదేవి, కృష్ణ రాజపుత్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మిని సన్మానిస్తున్న టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఫ్యూజ్ బాక్స్ తెరిచి ఉండటమే కాక చిన్నారులకు సైతం అందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. పక్కనే నీటి టాంక్ వాల్వ్ కూడా ఉంది. అప్పుడప్పుడు నీరు లీకవుతోంది. దీంతో చిన్నారులు, పెద్దలు ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లే సమయంలో షాక్ తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఫ్యూజ్ బాక్స్‌ను అందనంత ఎత్తులో ఏర్పాటు చేసి ఫ్యూజ్ బాక్స్‌కు మూతను కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

– చున్నూ పాషా, మూసాపేట



మూత లేకుండా ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

మెరిసిన రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెట్లు

మియాపూర్ : మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్ అథ్లెట్లు సత్తా చాటారని అథ్లెట్స్ మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండుల పాటు జరిగిన మాస్టర్ అథ్లెట్స్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుండి 48 మంది అథ్లెట్లు పాల్గొన్నారని తెలిపారు. లాంగ్‌జంప్, హై జంప్, ట్రిబుల్ జంప్, షాట్‌పుట్, డిస్క్, జావలెన్‌త్రో, హామర్‌త్రో, రన్నింగ్, నడక పోటీల్లో అథ్లెట్లు తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. 45 పతకాలను సాధించారని, అందులో 20 బంగారు పతకాలు, 11 వెండి పతకాలు, 14 కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. వారిని అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్, కార్యదర్శి నూనె సురేందర్‌లు అభినందించారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ప్రత్యేక శిక్షణతోనే తమకు పతకాలు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు అథ్లెట్లు పేర్కొన్నారు.

సైక్లింగ్‌పై చిన్నారులకు అవగాహన

గచ్చిబౌలి: ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'బై సైకిల్ బస్' భావనను పెంపొందించేందుకు చిన్నారులకు సైక్లింగ్ నిర్వహించారు. మాదాపూర్‌లోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ విద్యార్థులతో కలిసి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి సైక్లింగ్ చేశారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో బైసైకిల్ బస్‌కు అవకాశం కల్పిస్తే పర్యావరణానికి మేలు జరుగుతందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులంతా కలిసి తొక్కితో బైసైకిల్ బస్‌లో ఎంచక్కా చక్కర్లు కొట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ హైట్స్ ప్రిన్సిపల్ నిషా, మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ పార్కులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. కేంద్రంలో సౌకర్యాల గురించి వైద్యులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 150 మందికి కంటి పరీక్షలు చేసి 148 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఇద్దరికి ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు.



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఇంద్రాహిల్స్ సమస్యలు పరిష్కరిస్తా



ఇంద్రాహిల్స్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో దశలవారీగా అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని ఇంద్రాహిల్స్‌కాలనీలో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ,రోడ్లు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న అధికారులకు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కొద్ది పనులను త్వరగా పూర్తి చేసి ఇక్కడి ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. శ్మశానవాటికకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని కాలనీవాసులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శ్రావణి, షఖాబ్ అహ్మద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నాయకులు వెంకట్ నాయక్, కర్ణాటక రాజు, పోశెట్టిగౌడ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరాక్రమ్ దివస్

వాడవాడలా నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులు

'మీరు రక్తం ఇవ్వండి.. నేను స్వాతంత్య్రం తెస్తాను' అనే నినాదంతో దేశంలోని ప్రతి ఒక్కరిలో స్వాతంత్య్ర కాంక్షను రగిలించిన గొప్ప యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. స్వతంత్ర భారతే లక్ష్యంగా ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అలాంటి గొప్ప స్వాతంత్య్ర సమరయోధుడి జయంతిని భారత ప్రభుత్వం పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తోంది. సోమవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలో నేతాజీ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలు, కార్యాలయాలు, కాలనీల్లో నేతాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ ధైర్య సాహసాలు, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఆదర్శమని పలువురు నేతలు అన్నారు. విద్యార్థులు బాగా చదివి నైపుణ్యాలను పెంచుకొని నేతాజీలాగా దేశసేవకు సిద్ధం కావాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుమ్మల మోహన్‌కుమార్, భాగ్యలక్ష్మి



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నేతాజీ జయంతి వేడుకల్లో మాధవరం కాంతారావు, బీజేపీ నాయకులు



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ సెక్రటరీ ఎస్‌కే.జావద్ అలీ



ఎల్లమ్మబండలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



కూకట్‌పల్లి పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు